# నికృష్టదోపిడీకి వీలుగా నెట్టబడుతున్న వలస కార్మికులు

**జీవనోపాధికోసం,**ఉద్యోగావకాశాలకోసం రాష్ట్రాల హద్దులు దాటి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలసవెళ్ళటమనేది ఆధునిక భారత దేశంలో స్పష్టంగా కన్పించే వాస్తవంగా వుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో అంతర్రాష్ట్ర వలసలు సాగించిన వారి సంఖ్య 45 కోట్ల 36 లక్షలుపైగా వుందని అంచనా. గత రెండున్నర దశాబ్దాల కాలంలో అంతర్రాష్ట్ర వలసల సంఖ్య పెరుగుతూ వస్తోందని వివిధ సర్వేలు ఎత్తి చూపుతున్నాయి. మరోమాటల్లో చెప్పుకోవాలంటే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క నయాఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో ఈ అంతర్రాష్ట్ర వలసలు మరింత హెచ్చాయని అర్థమౌతోంది ఈ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో మనదేశంలో మన పాలకులు, పాలకవర్గాలు ప్రకటించుకుంటున్న 'ఆశ్చర్యపరిచే' ఆర్థికాభివృద్ధి – రక్తం చెమటతో తడిసిన ఈ వలస కార్మికుల శ్రమశక్తి లేకుండా సాధ్యంకాలేదనేది కూడా వాస్తవం. అయితే ఈ వలస కార్మికులు ఎల్లవేళలా సమస్యాత్మకమైన వారిగా చూడబడుతూ, నిరంతరాయంగా దాడులకు గురవుతూ వస్తున్నారు. నిరుద్యోగాన్ని పెంచుతున్నవారిగా, నేరాలను పెంచేవారిగా, ప్రాంతీయ పాలక రాజకీయ నాయకులు వీరిని నిందిస్తున్నారు. తగినవిధంగా పౌరసౌకర్యాలు లభించక, అధ్వాన్నంగా మారడంతో స్థానిక ప్రజానీకం వారి ఆగ్రహాన్ని వలస కార్మికులపై ప్రదర్శిస్తున్నారు. ఇక, సాంస్కృతికంగా పట్టణ వాసులతో కలిసిపోలేరంటూ, ఛాందసవాదులు వీరిపై విరుచుకుపడుతున్నారు. అయితే వ్యాపార, పారిశ్రామికవర్గం మాత్రం వలస కార్మికుల కారుచౌక శ్రమని, సేవలను నిరభ్యంతరంగా దోపిడీ చేస్తున్నారు. పట్టణ మధ్యతరగతికి చెందిన వారికి కూడా వలస కార్మికులు ఇంటిపనులలో సేవలందిస్తున్నారు. ఏవిధమైన భద్రతాలేకుండా, దోపిడీకి గురయ్యే దుస్థితిలో వలస కార్మికులు వుండటాన్ని స్వార్థపర శక్తులు అవకాశంగా తీసుకొని వారి దాడులను వలస కార్మికులపైకి ఎక్కుపెడుతున్నారు. మన దేశంలో సంభవించే ప్రతి రాజకీయ, ఆర్థిక, సామాజిక ఆందోళనలన్నింటి సందర్భంగానూ, ఈ అంతర్రాష్ట్ర వలసకార్మికులపై దాడులు జరుగుతున్నాయనేది ఒక రుజువైన వాస్తవం.

మహారాష్ట్రలో రాజకీయ అధికారం చేజిక్కించుకునేందుకు శివసేన పార్టీ దక్షిణభారత వలసకార్మికులను ఒక లక్ష్యంగా చేసుకొని దాడులు సాగించటాన్ని గతంలో చూశాం.

నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యా నంతరం జరిగిన దాడులలో న్యూఢిల్లీ తదితర ప్రాంతాలలో శిక్కులను లక్ష్యంగా చేసుకొని దాడులు ఏవిధంగా జరిగాయో మనం చూశాం.

స్థానిక సంస్కృతికి భిన్నంగావున్న కారణంగా ఈశాన్య రాష్ట్రాల ప్రజలు కర్ణాటకనుండి ఏవిధంగా బలవంతంగా గెంటివేయబడ్డారో కూడా మనకు తెలుసు. ఈశాన్య రాష్ట్రాలనుండి వచ్చిన వలసకార్మికులపై దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఇలాంటి దాడులే జరుగుతున్నాయి.

పెద్దనోట్ల రద్దు సందర్భంగా వలసకూలీలు ఘోరంగా నష్టపోయారు. వారు పనులు కోల్పోయి, జీవనాధారం లేక తమ స్వస్థలాలకు ఒట్టి చేతులతో గత్యంతరంలేక తిరిగి వచ్చారు.

ఇప్పుడు గుజరాత్ రాష్ట్రం వంతు వచ్చింది. గుజరాత్ రాష్ట్రంలోవున్న హిందీ మాట్లాడే రాష్ట్రాలనుండి వచ్చిన వలస కార్మికులపై హింసాయుత దాడులు జరగటంతో, వారంతా భద్రత కరువై గుజరాత్‌ను వదలి తరలి పోతున్నారు. మత విద్వేషంతో వెయ్యిమందిని బలిగొన్న 2002 నాటి అప్రతిహత మత కల్లోలాలు గుజరాత్ సామాజిక చట్రాన్ని చిన్నాభిన్నం చేశాయి. ప్రస్తుతం ఆ విద్వేషం వలస కార్మికులవైపు మళ్ళించబడింది.

గుజరాత్‌లోని వలస కార్మికులపై జరుగుతున్న దాడుల వివరాలలోకి వెళ్ళబోయే ముందు, మనదేశంలో సాగుతున్న అంతర్రాష్ట్ర వలసల నేపథ్యాన్ని, దానివెనుక నున్న కారణాలను తెలుసుకోవాలి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు ఫలితంగా మనదేశం అద్భుతమైన, అనూహ్యమైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నదని మనదేశ పాలకులు, పాలకవర్గాలు, విధాన రూపకర్తలు చాలా గొప్పగా చెబుతున్నారు.

అయితే, మనదేశంలో శ్రామిక ప్రజల జీవనంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని తీసుకు రావటంలో ఈ విధానాలు పూర్తిగా విఫల మయ్యాయనేది నిరాకరించవీలులేని వాస్తవం. అంతేగాక, ఈ విధానాలు మనదేశ ప్రజల– ముఖ్యంగా గ్రామీణ ప్రజల–దుస్థితిని మరింత తీవ్రం చేశాయి. ఆ ఉదారీకరణ ఆర్థికవిధానాలు వ్యవసాయరంగాన్ని లోతైన సంక్షోభంలో కూరుకుపోయేట్లు చేశాయి. మరోవైపున అవసరానికి తగినవిధంగా ఉద్యోగాలను కల్పించటంలో ఆ విధానాలు సంపూర్ణంగా విఫలమయ్యాయి. అత్యధిక ప్రజానీకానికి ఉపాధి కల్పించే వ్యవసాయరంగమే సంక్షోభంలో కూరుకుపోవటంతో, గతంలో కల్పించిన విధంగా కూడా గ్రామీణ ప్రజానీకానికి వ్యవసాయరంగం ఉపాధి కల్పించలేకపోతోంది. ఈ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కాలంలో గ్రామీణ దుస్థితి, పేదరికం పెరిగిపోయాయి. ఈ దుస్థితికి గురైన గ్రామీణ ప్రజానీకం పొట్టచేతబట్టుకొని ఉపాధిని వెదుక్కుంటూ సుదూర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్ళాల్సిన స్థితి ఏర్పడింది. నానాటికీ ప్రపంచీకరణ విధాన వైఫల్యంయొక్క కారణంగా అంతర్రాష్ట్ర వలసలు కూడా పరిగణించదగిన విధంగా పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన పేదరికం, నిరుద్యోగం పెద్దసంఖ్యంలో వలసలకు కారణంగా వుంది. దుర్భర దారిద్ర్యం, దుస్థితిలో నుండటం అనే కారణాలు ఈ అంతర్రాష్ట్ర వలస కార్మికులను పలు రూపాల్లో నికృష్టంగా దోచుకోవటానికి అనువుగా మలుస్తున్నాయి. అదేవిధంగా

స్వార్ధపరశక్తుల దాడులకు వీరు కేంద్రమౌతున్నారు. మరోవైపున భారతదేశంలో బాగా అభివృద్ధిచెందిన హోదాలో నున్న రాష్ట్రాలకు అంతర్రాష్ట్ర వలసలు సాగటం అనివార్యంగా పరిణమించింది. గ్రామీణ భారత దేశంలో వ్యవసాయరంగం ఎప్పుడైతే ఉపాధి కల్పించలేకపోతోందో, వలసలు కొనసాగుతూ వుండటం అనేది నేటి వాస్తవంగా వుంది.

2011 సం॥నుండి లభిస్తున్న సమాచారంపై ఆధారపడి, 2016 – 17 నాటి ఆర్థిక సర్వే ప్రకారం, మనదేశంలో అత్యధిక వలస కార్మికులను కలిగివున్న రాష్ట్రాలలో గుజరాత్ ఒకటిగా వుంది. గుజరాత్‌లోని పారిశ్రామిక కార్మికశక్తిలో వలసకార్మికులు అధిక భాగంగా వుండటంతోపాటు గుజరాత్ రాష్ట్ర జనాభాలో వీరు మూడింట ఒక వంతుగా వున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, తయారీ, నిర్మాణరంగాలలో కారుచౌక శ్రమద్వారా ఈ వలసకార్మికులు గుజరాత్ రాష్ట్రాభివృద్ధిలో ఓ శక్తివంతమైన పాత్ర నిర్వహిస్తున్నారు.

గుజరాత్ రాష్ట్రప్రభుత్వం వద్ద వలస కార్మికుల ఖచ్చితమైన సంఖ్య గురించిన సమాచారం లభించకున్నప్పటికీ, గుజరాత్‌లోని మొత్తం కార్మికులలో వలసకార్మికులు 35 శాతంగా వున్నారని పారిశ్రామిక, వ్యాపార వర్గాల సమాచారం వెల్లడిచేస్తోంది.

గుజరాత్ రాష్ట్రంలోని వివిధ తయారీ యూనిట్లలోను, సేవారంగ పరిశ్రమలలోను, నిర్మాణరంగంలోను రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘర్, అస్సామ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలనుండి వలసవచ్చిన కార్మికులు శ్రమ చేస్తున్నారు.

వీరిలో అత్యధికులు కాంట్రాక్టరు ద్వారా సమీకరించబడి సుదూర ప్రాంతాలకు, అత్యంత తక్కువవేతన ఒప్పందంపై పంపబడినవారే. వలస కార్మికులకొరకు ప్రత్యేక శ్రమ అంగళ్ళను సృష్టించటంద్వారా, కాంట్రాక్టర్లు లేబర్ మార్కెట్‌ను విడగొట్టటంవలన ఈ వలస కార్మికుల శ్రమశక్తిని దోచుకోవటం సులభ తరమైంది. చెప్పనలవికాని బాధలతోపాటు దుర్భర జీవన, పని పరిస్థితుల నడుమ ఈ వలస కార్మికులు జీవనం సాగిస్తున్నారు. వారందరికీ తక్కువ వేతనమివ్వటమేగాక, ఎలాంటి అదనపు ప్రయోజనాలు లేకుండానే చాలా ఎక్కువ గంటలు పనిచేయించుకుంటున్నారు. వారంతా శలవులు లేదా సామాజిక భద్రత వంటివేవీ లేకుండానే చాకిరీ చేయవలసివస్తోంది. కొంత విద్య కలిగి, అర్థ–నైపుణ్య కార్మికులుగా వున్నవారికి కొంతమేర అదనపు వేతనాలు లభిస్తున్నప్పటికీ, వారికి కొన్ని శలవులు ఇస్తున్నప్పటికీ ఎన్నో రూపాల్లో వారు కూడా దోపిడీ చేయబడు తున్నారు. ఈ వలస కార్మికులు ప్రమాదకరమైన, కష్టతరమైన పనిప్రదేశాల్లో ఎలాంటి రక్షణలూ లేకుండా విధులు నిర్వహించాల్సివస్తోంది. చాలా తరచుగా పని ప్రదేశాల్లో 'ప్రమాదాల్లో' ఈ వలస కార్మికులు చనిపోవటమో, అదృశ్య మవటమో లేదా వృత్తిపరమైన ప్రమాదకర పరిస్థితులకు గురవటమో జరుగుతూవస్తోంది. వృత్తి నిర్వహణలో వారు ప్రమాదాల బారినపడి మరణించినా, లేదా అంగవికలురైనా లేదా అనేక రకాల వ్యాధులకు గురైనా వారికి ఎలాంటి నష్టపరిహారమూ చెల్లించటంలేదు.

నైపుణ్యం లేని వలస కార్మికులలో అత్యధికులు పని ప్రదేశాల్లో యాజమాన్యాలు ఏర్పాటుచేసిన తాత్కాలిక గుడిశలలో, రోడ్లప్రక్క, మురికివాడలలో తలదాచుకుంటున్నారు. వీరు నివసించే ప్రాంతాలలో అత్యధిక జనవాసాలకు మునిసిపాలిటీలు ఎలాంటి పౌర సేవలను అందజేయటంలేదు.

1979లో అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టంగా చెప్పబడేది ఒకటి చేసినప్పటికీ, దాని ప్రకారం వలస కార్మికులకు కనీస వేతనాలు, సక్రమ వేతన చెల్లింపు, సక్రమ పనిగంటలు, ఓవర్‌టైమ్‌కు అధికవేతనం, సరైన జీవన– పనిపరిస్థితులు, వలస కార్మికుల బిడ్డల చదువు, ఆరోగ్య రక్షణ చేపట్టటంవంటి కొన్ని చట్ట పరమైన హక్కులు కల్పించినట్లుగా చెబుతు న్నప్పటికీ, ఆ చట్టం కేవలం కాగితాలకే పరిమితమైంది తప్ప ఏనాడూ అమలుకు నోచుకోలేదు. వలస కార్మికులు అధికసంఖ్యలో లభిస్తున్న రాష్ట్రాలలోని ప్రభుత్వాలుగానీ, వలస కార్మికులను అధిక సంఖ్యలో పనిలోకి తీసుకుంటున్న రాష్ట్రాలలోని ప్రభుత్వాలుగానీ– ఈ చట్టం అమలు గురించి ఏమాత్రం లెఖ్ఖపెట్టకపోవటమేగాక, వలస కార్మికుల సంక్షేమం, హక్కులపట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చాయి. వలస కార్మికులను సమకూర్చే కాంట్రాక్టర్లు ఈ విధమైన చట్టాలను తారుమారు చేయటంలో నైపుణ్యంకల వారిగా కూడా వున్నారు.

ఇటుక బట్టీలు, గృహ నిర్మాణం, ఉప్పు తయారీ, గృహసేవలు, చిన్నపాటి సేవలు, చిన్న వ్యాపారాలు, వీధుల్లో తిరిగి అమ్మటం, ఎంబ్రాయిడరీ పనులు వంటి వివిధ రకాల పనులలో అత్యధిక వలస కార్మికులకు తాత్కాలికంగానో, పాక్షికంగానో పనులు కల్పిస్తున్నారు. అలాగే వలస కార్మికులలో మరికొందరు సెక్యూరిటీగార్డులు, డ్రైవర్లు, సిరామిక్, ఔషధాలు, రసాయనాలు, ఆటో మొబైల్స్, వాటి అనుమంధ పరిశ్రమలు, ఆహార శుద్ధికర్మాగారాల వంటి వానిలో కార్మికులుగా పనిచేస్తున్నారు.

'డైమండ్ సిటీ' గా పేరుగాంచిన గుజరాత్ లోని సూరత్ నగరంలో వలస కార్మికుల సంఖ్య అత్యధికంగా వుంది. వస్త్ర పరిశ్రమ, వాటి అనుబంధ రంగాల్లో, నిర్మాణ రంగంలో మరియు హజారియాలోని భారీ పారిశ్రామిక కర్మాగారాలలో వలస కార్మికులే అధిక సంఖ్యలో వున్నారు.

సిరామిక్ మార్బుల్ కేంద్రాలైన అహమ్మదాబాద్, రాజ్‌కోట్‌లలో; వడోదరాలోని రసాయన, పెట్రో–రసాయన కర్మాగారాలలో; అలాంగ్ మరియు శబర్‌కాంత్‌లలోని షిప్ బ్రేకింగ్ పరిశ్రమలలోనూ వలసకార్మికులే అధిక సంఖ్యలో వున్నారు.

గుజరాత్ రాష్ట్రాభివృద్ధికి ప్రముఖ సాధనాలుగా వున్న ఈ వలస కార్మికులనే లక్ష్యంగా చేసుకొని హింసాయుత దాడులు సాగుతున్నాయి. సెప్టెంబర్ 28న జరిగిన ఓ ఘటన దీనికి సాకుగా చెప్పబడుతోంది. 14 నెలల పసిపాపను బీహార్‌కు

చెందిన ఓ వలస కార్మికుడు అత్యాచారం చేశాడనే ఓ ఆరోపణతో ఇది మొదలైంది. ఈ ఘటనపై వెనువెంటనే గుజరాతీయేతర వలసకార్మికులపై హింసాయుత దాడులు మొదలైనప్పటికీ, దీనికి మూలకారణం మరో చోట వుంది.

దేశంలోని ఇతర రాష్ట్రాలలో వలెనే గుజరాత్ రాష్ట్రంలోనూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా వుంది. ఉద్యోగకల్పనలో రాష్ట్రప్రభుత్వం విఫలమవటంతో, ఉద్యోగార్థులు ప్రత్యేకించి నిరుద్యోగ యువత నిరాశాపూరిత పరిస్థితులల్లో తీవ్ర అసంతృప్తితో వున్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని, అవసరమైన ఉద్యోగాలను సృష్టించలేని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను ఈ పరిస్థితికి కారణంగా ఎంచి, వారిపై ఆగ్రహాన్ని ప్రదర్శించటానికి బదులుగా, నిరుద్యోగ యువత వలస కార్మికులనే తమ నిరుద్యోగానికి కారకు లన్నట్లుగా భావించి, వారికి వ్యతిరేకంగా తమ అసమ్మతి, అసంతృప్తిని పెంచుకుంటూ వస్తున్నారు.

నిరుద్యోగ యువతలోని ఈ అసమ్మతి, అసంతృప్తులను పాలకవర్గ రాజకీయపార్టీలు చాకచక్యంగా వుపయోగించుకొని, మూల సమస్యపై నుండి వారి దృష్టిని మళ్ళించి, స్థానిక –స్థానికేతర నినాదంతో ముందుకొచ్చాయి. 'గుజరాత్ రాష్ట్ర ప్రజలకే ఇక్కడి ఉద్యోగాలన్నీ' వంటి నినాదాలతో 'బయటివారి'పై విద్వేషాన్ని ప్రేరేపించే వ్యాఖ్యానాలతో వలస కార్మికులపై దాడులు సాగించారు.

ఉద్యోగకల్పనలో విఫలమైన గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం, నిరుద్యోగ యువతయొక్క దృష్టిని మళ్ళించే వ్యూహాన్ని చాకచక్యంగా అమలుచేసి వలస కార్మికులపై ఎక్కుపెట్టింది.

అత్యాచార ఘటనగా పేర్కొంటున్న దానికి కేవలం 3 రోజుల ముందుగా, అసంతృప్తితో వున్న నిరుద్యోగ యువత ఓట్లను, రానున్న 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక ప్రకటన చేశాడు. రాష్ట్రంలో 80శాతం ఉద్యోగాలను స్థానికులకు, 20శాతం కంపెనీల స్థావర ప్రాంతాల వారి వారసులకు తప్పనిసరిగా లభించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టం చేయబోతున్నట్లుగా ఆయన ప్రకటించాడు. గుజరాత్ రాష్ట్రంలో అధికారంలో నున్న పాలకవర్గ బిజెపి ద్వారా వలస కార్మికులకు వ్యతిరేకంగా నిరుగ్యోగ యువత ఈ విధంగా రెచ్చగొట్టబడివున్నారు.

అత్యాచార ఘటనగా చెప్పబడుతున్న దానిని ఉపయోగించుకొని మరోవైపున కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్పేష్ ఠాకూర్ తన ఆధ్వర్యం లోని 'క్షత్రియ ఠాకూర్ సేన' ద్వారా వలస కార్మికులకు వ్యతిరేకంగా ద్వేష భావాన్ని రెచ్చగొట్టాడు. ఈ విధంగా పాలకవర్గ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ ప్రజలమధ్య మైత్రీ భావాన్ని పెంపొందిచే బదులుగా అత్యాచార ఘటనను సాధనంగా చేసుకొని తమ నీచ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవటంలో పోటీపడ్డాయి. స్థానికులకు, వలసకార్మికులకు నడుమ విద్వేషపూరిత హింసను నివారించ టానికో లేదా సర్దుబాటు చేయటానికో పూనుకోకుండా పాలకవర్గ పార్టీలైన ఈ రెండూ ఒకరినొకరు వేలెత్తి చూపుకుంటూ, పరస్పరా రోపణలతో కుటిల రాజకీయ క్రీడ సాగించాయి. ఈవిధంగా వలస కార్మికులపై మొదలైన హింస ఉత్తర గుజరాత్‌లోని 7 జిల్లాలకు వ్యాపించింది. భీతావహులైన వలస కార్మికులు తమపై సాగుతున్న హింసాత్మక దాడులకు భీతిల్లి ప్రవాహంలా తరలిపోయారు. ఇతర రాష్ట్రాల లోనూ, నగరాలలోనూ వలస కార్మికులపై ఇదే తరహా హింసాత్మక దాడుల ఘటనల అనంతరం గుజరాత్‌లో పరిస్థితి కూడా 'సద్దుమణిగింది'. ఏమైనా ఈ 'సద్దుమణగటం' వలస కార్మికుల జీవన – పనిపరిస్థితులను ఏమాత్రం మెరుగు చేసేది కాదు. పైగా, ఈ నిరుపేద వలస కార్మికులు స్థానికులైన కార్మికులతో పోల్చినపుడు మరింత అధిక పనిభారంతోపాటు, ప్రమాద కరమైన జీవన–పని పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తోంది.

మనదేశంలోని ప్రజావ్యతిరేక పాలకవర్గాల పాలనలోని అసమాన, అర్ధవలస–అర్ధఫ్యూడల్ దోపిడీ వ్యవస్థలో అశేష ప్రజాసామాన్యానికి శాంతి, సంక్షేమం అనేవి ఎండమావిగా రుజువైంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా చెప్పబడేదిగానీ ఒకే సమగ్ర భారత జాతిగా చెప్పబడే భావనకానీ – కార్మిక ప్రజానీకానికి ప్రత్యేకించి జీవనంకోసం వలసవెళ్ళవలసిన దుస్థితిలోకి నెట్టబడిన వలస కార్మికులకుగానీ రక్షణను, భద్రతను కల్పించలేవు. ఆవిధంగా వీరంతా దాడులకు వీలైన లక్ష్యాలుగా వున్నారు.

వలస కార్మికులకు వ్యతిరేకంగా విద్వేషాన్ని ప్రేరేపించటం మనదేశానికే పరిమితమైన విషయంకాదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వేగవంతమవటంతో ప్రపంచవ్యాపితంగా వలసవచ్చిన కార్మికులపై వివిధ దేశాలలో దాడులు జరుగుతున్నాయి. యూరప్, అమెరికా తదితర అనేకచోట్ల ఆయాదేశాల ప్రభుత్వాల దన్నుతో వలసవచ్చిన కార్మికులపై స్థానికులు ఘోరమైన దాడులకు పాల్పడటాన్ని మనం చూశాం.

జాతివాదం, తెగవాదం, స్థానికవాదం వంటి విద్వేష వాదాలతో వలస కార్మికులపై ప్రపంచవ్యాపితంగా దాడుల తీవ్రత పెరుగు తోంది. అతి – మితవాద గ్రూపులు, ప్రతీఘాత రాజకీయ పార్టీలు ప్రపంచంలోని వివిధ దేశాలలో అధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. ప్రపంచ మానవజాతి పాలిట సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క దుష్టపరిణామం ఇది.

ప్రపంచవ్యాపితంగానూ, ప్రత్యేకించి భారతదేశంలోనూ మానవజాతి పాలిట ప్రమాదకరంగా పరిణమిస్తోన్న ఈ ప్రతీఘాతుక పరిణామాలను కార్మికవర్గం అవగాహన చేసుకోవాలి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ డొల్లతనాన్ని వెల్లడిచేసే పోరాటాలకు వీలైన ప్రయత్నాలన్నీ చేయాలి. ప్రపంచ ప్రజానీకానికి శాంతి, సంక్షేమం, సంపదలను సమకూర్చటంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వైఫల్యాన్ని, అశక్తతను, నిరర్ధకత్వాన్ని సమర్ధవంతంగా వెల్లడి చేయాలి.

ఈ అసమాన దోపిడీవ్యవస్థే నిరుద్యోగానికి మూలకారణమనే విషయాన్ని నిరుద్యోగ యువత తెలుసుకునేలా చేయాలి. నిరుద్యోగం, అసమానత, విద్వేషం, దోపిడీలేని సామ్యవాద వ్యవస్థ స్థాపన లక్ష్యం దిశగా ప్రస్తుత దోపిడీ వ్యవస్థపై పోరాటానికి సిద్ధంకావాలి.

ooooo